సాక్షి
నిజామాబాద్
బుధవారం । 6 । ఆగస్టు । 2025



సబ్సిడీపై వ్యవసాయ..

సాగులో రైతులకు వెన్నుదన్నుగా ఉండేందుకు వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ ప్రారంభించింది.

- 10లో ▸



విద్యుత్ హాకీ టోర్నీ..

రెండు రోజులపాటు కొనసాగిన విద్యుత్ ఉద్యోగుల రాష్ట్రస్థాయి హాకీ టోర్నమెంట్ మంగళవారం ముగిసింది.

- 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
37.7 /23.5

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

నిజాంసాగర్ నీటి విడుదల

నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు మంగళవారం నీటి విడుదల చేపట్టినట్లు నీటిపారుదల శాఖ ఏఈ అక్షయ్ తెలిపారు. 600 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నామన్నారు. ప్రధాన కాలువ ద్వారా ప్రవహిస్తున్న నీటిని ఆయకట్టు ప్రాంత రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎస్సారెస్పీకి తగ్గిన వరద

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు తగ్గుముఖం పట్టింది. ప్రాజెక్ట్‌లోకి 4,150 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 100 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 462 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా తాగు నీటి అవసరాలకు 231 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా మంగళవారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1078.30(40.5 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

ఎత్తిపోతల ద్వారా నీటిని విడుదల చేయాలి

నిజామాబాద్ సిటీ: అలీసాగర్, గుత్ప ఎత్తిపోతల ద్వారా కావాల్సిన నీటిని ప్రభుత్వం విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూరు భూమయ్య డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా రైతులు వరి నాట్లు వేశారని, సకాలంలో వర్షాలు పడక వరి నాట్లు ఎండిపోతున్నాయన్నారు. అధికారులు ప్రతి ఏడాది జూన్, జూలైలో అలీసాగర్, గుత్ప ఎత్తిపోతల ద్వారా నీటిని విడుదల చేసేవారని, ఈ ఏడాది ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు. ప్రభుత్వం స్పందించి నీటిని విడుదల చేయాలని కోరారు. నాయకులు దేశెట్టి సాయిరెడ్డి, హగ్గు ఎర్రన్న, బోరిగాం సాయిలు, రాపాని గంగాధర్, సాయి పాల్గొన్నారు.

ల్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలి



డిచ్‌పల్లి: సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లను సద్వినియోగం చేసుకుని చదువుతోపాటు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని విద్యార్థులకు డీఈవో అశోక్ సూచించారు. వ్యాపారవేత్త ఏనుగు దయానంద్‌రెడ్డి సహకారంతో రూ.2.5 లక్షల వ్యయంతో ఖిల్లా డిచ్‌పల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌ను డీఈవో మంగళవారం ప్రారంభించారు. ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, గెజిటెడ్ హెచ్‌ఎం సీతయ్య, మాజీ సర్పంచ్ సుదర్శన్, గంగాధర్, అమ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సావిత్రి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. పాఠశాలను అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ సందర్శించారు. ల్యాబ్‌లను పరిశీలించి తరగతి గదుల్లో విద్యార్థులతో మాట్లాడారు.

ఎంఈడీ పరీక్ష ఫీజు చెల్లించండి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ వర్సిటీ పరిధిలోని ఎంఈడీ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజును ఈనెల 18 వరకు చెల్లించాలని కంట్రోలర్ సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు, సెప్టెంబర్‌లో జరగబోయే ఎంఈడీ 4వ సెమిస్టర్ రెగ్యులర్, 1, 2, 3వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ థియరీ పరీక్షలకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఈనెల 18వరకు ఫీజు చెల్లించాలన్నారు. రూ.100 అపరాధ రుసుముతో 21 వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉంటుందన్నారు.


కారులో పీపీపీ వీక్షించిన వేముల



వేల్పూర్ : కాళేశ్వరం ప్రాజెక్టుపై మాజీ మంత్రి హరీశ్‌రావు తెలంగాణ భవన్‌నుంచి ఇచ్చిన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్(పీపీపీ)ను మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి కారులో ప్రయాణిస్తూ వీక్షించారు. జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి శిబు సోరెన్ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు ఆ రాష్ట్రానికి వెళ్లిన వేముల రాంచీ నుంచి సోరెన్ స్వగ్రామానికి కారులో ప్రయాణిస్తూ పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్‌ను వీక్షించారు. అనంతరం నిజామాబాద్‌లో పీపీపీని వీక్షించిన నాయకులతో మాట్లాడారు.

వారిదే ఇష్టారాజ్యం!

- విపక్ష ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో అధికార పార్టీ నేతల పెత్తనం
- వారు ప్రతిపాదించిన పనులకే ప్రత్యేక నిధుల వినియోగం
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి ద్వారా నిధుల కేటాయింపులు
- నిస్సహాయ స్థితిలో విపక్ష పార్టీల ప్రజాప్రతినిధులు
- ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్నారని ఆగ్రహావేశాలు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : అధికారం మనదే కదా, మనం ఆడిందే ఆట.. పాడిందే పాట అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు కాంగ్రెస్ పార్టీ నాయకులు. నియోజకవర్గాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి మంజూరైన ప్రత్యేక నిధులను అధికార పార్టీ నియోజకవర్గాల ఇన్‌చార్జులు జిల్లా ఇన్‌చార్జి మంత్రి ద్వారా తమ ఇష్టం వచ్చిన పనులకే ఖర్చు పెడుతున్నారు.

జిల్లాలోని ఆర్మూర్, బోధన్, నిజామాబాద్ రూరల్, నిజామాబాద్ అర్బన్, బాల్కొండ నియోజకవర్గాలకు 2024–25 సంవత్సరానికి గాను రూ.10 కోట్ల చొప్పున మొత్తం రూ.50 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధుల ద్వారా ఈ ఐదు నియోజకవర్గాల్లో మొత్తం 1,122 పనులు మంజూరయ్యాయి. వీటిలో 225 పనులు పూర్తయ్యాయి. 5 పనులు జరుగుతున్నాయి. మరో 892 పనులు ఇంకా మొదలు కాలేదు.

మొత్తం రూ.50 కోట్లలో ఇప్పటివరకు రూ. 6,93,35,244 ఖర్చు చేశారు. నియోజకవర్గాల్లో ప్రజలచేత గెలుపొంది ప్రాతినిధ్యం వహిస్తున్న విపక్ష ఎమ్మెల్యేలను కాదని అధికార పార్టీ నాయకులు చెప్పినట్లే పనులు చేస్తున్నారు. ప్రజల ఓట్లతో గెలుపొంది ప్రాతినిధ్యం వహిస్తున్న తమకు అభివృద్ధి పనుల కోసం ఒక్క పైసా లేకుండా చేయడమేమిటని బాల్కొండ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, ఆర్మూర్ బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, నిజామాబాద్ అర్బన్ బీజేపీ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- ఆర్మూర్ నియోజకవర్గంలో 192 పనులకు గాను 41 పనులు పూర్తి అయ్యాయి. ఒక పని పురోగతిలో ఉంది. 150 పనులు ఇంకా ప్రారంభించలేదు. ఇప్పటి వరకు రూ.1,11,37,346 ఖర్చు చేశారు.
- బాల్కొండ నియోజకవర్గంలో 290 పనులకు గాను 55 పనులు పూర్తి అయ్యాయి. ఒక పని పురోగతిలో ఉంది. 234 పనులు ఇంకా ప్రారంభించలేదు. రూ.1,70, 52,858 ఖర్చు చేశారు.
- బోధన్ నియోజకవర్గంలో 158 పనులు చేపట్టాలని నిర్ణయించారు. వీటిలో 14 పనులు మాత్రమే పూర్తి అయ్యాయి. ఒక పని పురోగతిలో ఉంది. 143 పనులు ఇంకా ప్రారంభించలేదు. రూ.67,73,847 ఖర్చు చేశారు.
- నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో 178 పనులను చేపట్టాలని నిర్ణయించారు. ఇందులో ఇప్పటి వరకు 29 పనులు మాత్రమే పూర్తి చేశారు. ఒక పని పురోగతిలో ఉంది. 148 పనులు ఇంకా ప్రారంభించలేదు. రూ.1,52,52,025 ఖర్చు చేశారు.
- నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో 304 పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఇందులో ఇప్పటి వరకు 86 పనులు పూర్తి అయ్యాయి. ఒక పని పురోగతిలో ఉంది. 217 పనులు ప్రారంభం కాలేదు. రూ.1,91,19,168 ఖర్చు చేశారు.

అప్రజాస్వామికం..



ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన ఎమ్మెల్యేలకు అభివృద్ధి నిధులు కేటాయించకపోవడం శోచనీయం. అధికార పార్టీ నాయకులు పూర్తి అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసమర్థతపై ప్రశ్నిస్తే ఇళ్లపై దాడులు చేసే సంస్కృతికి తెరతీశారు. ఇది మంచి పద్ధతి కాదు.

– వేముల ప్రశాంత్‌రెడ్డి, బాల్కొండ ఎమ్మెల్యే

సీడీపీ నిధులు పైసా ఇవ్వలేదు..



నగరాభివృద్ధిని కాంక్షించిన ప్రజలు నన్ను ప్రజాప్రతినిధిగా గెలిపించారు. ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్కపైసా సీడీపీ నిధులు ఇవ్వలేదు. ప్రత్యేక అభివృద్ధి నిధుల కింద వచ్చిన డబ్బుల్లో ఒక్కపైసా కూడా ఎమ్మెల్యే ద్వారా ఖర్చు చేయడం లేదు. అధికార పార్టీ నాయకులే ఇష్టం వచ్చినట్లు ఖర్చు చేస్తున్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి తూట్లు పొడుస్తున్నారు.

– ధన్‌పాల్ సూర్యనారాయణ, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే

ఇది మంచి పద్ధతి కాదు..



ఆర్మూర్ ప్రజలు భారీ మెజారిటీతో నన్ను గెలిపించారు. నా దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఒక్క పైసా ఇవ్వలేదు. సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్‌కు మాత్రం రూ.వెయ్యి కోట్లు కేటాయించడం అసమతుల్యానికి నిదర్శనం. అధికార పార్టీ నాయకులు ఇష్టం వచ్చినట్లు చేస్తే భవిష్యత్ తరాలకు ఏమి చెప్పాలి.

– పైడి రాకేష్‌రెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యే

కాళేశ్వరంతో రాష్ట్రం ధాన్యగారమైంది



మీడియాతో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

- బోగస్ నివేదికలతో తప్పుడు ప్రచారం
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి

నిజామాబాద్‌అర్బన్ : కాళేశ్వరం ప్రాజెక్టుతో తెలంగాణ ధాన్యగారంగా మారిందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై మాజీ మంత్రి హరీశ్‌రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను ఆన్‌లైన్‌లో వీక్షించిన అనంతరం మాజీ ఎమ్మెల్యేలు, నాయకులతో కలిసి జీవన్‌రెడ్డి జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై అపోహలను తొలగించేందుకే హరీశ్‌రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారన్నారు. కాంగ్రెస్, బీజేపీ సృష్టించిన అపోహలను పటాపంచలు చేస్తున్నామన్నారు. కేవలం కేసీఆర్‌ను అరెస్టు చేసేందుకే తప్పుడు నివేదికలు సిద్ధం చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రం బాగుపడడం ఓర్వలేని ద్రోహులంతా ఒకటై కేసీఆర్ పై కక్ష సాధింపు పాల్పడుతున్నారని విమర్శించారు. ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక అంతా బోగస్ కొట్టిపారేశారు. కేసీఆర్ జోలికి వస్తే తెలంగాణ ప్రజలు తిరగబడతారని హెచ్చరించారు. కాంగ్రెస్ పాలనపై జిల్లా నుంచి సమర శంఖం పూరిస్తామని ప్రకటించారు. నీరు లేక నోరు తెరిచిన నిజాంసాగర్‌ను కాళేశ్వరం ద్వారా నిండుకుండలా మార్చిన ఘనత కేసీఆర్‌కు ఉందన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు బిగాల గణేశ్‌గుప్తా, బాజిరెడ్డి గోవర్ధన్, జెడ్పీ మాజీ చైర్మన్ విఠల్‌రావు, సీనియర్ నాయకులు ప్రభాకర్, సత్యప్రకాశ్, సుజిత్ సింగ్ ఠాకూర్, జగన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

జాప్యానికి కారణమేమిటి?

- భూభారతి దరఖాస్తుల పరిష్కారంలో జాప్యంపై కలెక్టర్ అసంతృప్తి
- ఎందుకు చొరవ తీసుకోవడం లేదని తహసీల్దార్లకు ప్రశ్న
- ఆమోదించిన దరఖాస్తులను 24గంటల్లో ఆర్డీవోలకు పంపించండి
- వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

నిజామాబాద్ అర్బన్ : భూభారతి దరఖాస్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని పదేపదే చెబుతున్నా అర్జీల సత్వర పరిష్కారానికి ఎందుకు చొరవచూపడం లేదని పలు తహసీల్దార్ల తీరుపై కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. దరఖాస్తుల పరిష్కారం ఆలస్యమవుతున్న మండలాల తహసీల్దార్లను జాప్యానికి కారణాలు ఏమిటని ప్రశ్నించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఆర్‌ఐలు, సర్వేయర్లతో భూభారతిపై మంగళవారం సమీక్షించారు. రెవెన్యూ సదస్సుల్లో అందిన దరఖాస్తుల వివరాలు మండలాల వారీగా తెలుసుకున్న కలెక్టర్.. ఎన్ని దరఖాస్తులను పరిష్కరించారు? ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి? ఎంత మందికి నోటీసులు ఇచ్చారు? క్షేత్రస్థాయి పరిశీలన పూర్తయ్యిందా? తదితర వివరాలను తెలుసుకున్నారు. ఆర్డీవోలు ప్రతిరోజూ ఒక మండలాన్ని తప్పనిసరిగా సందర్శించి దరఖాస్తుల పరిష్కారానికి చేపడుతున్న చర్యలను పర్యవేక్షించాలని, అవసరమైతే క్షేత్రస్థాయికి వెళ్లాలని సూచించారు. నిర్ణీత గడువు లోగా అన్ని దరఖాస్తులు పరిష్కారం అయ్యేలా చూడాలని, ఆమోదించిన దరఖాస్తులను 24 గంటలలోగా ఆర్డీవోల ఆమోదం కోసం పంపించాలని తహసీల్దార్లను ఆదేశించారు. ఆన్‌లైన్‌లో అందిన దరఖాస్తులను సైతం వెంటనే పరిష్కరించాలన్నారు. సాదా బైనామా దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని, ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు అందిన వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు వీలుగా నోటీసులు రూపొందించుకుని అన్ని విధాలుగా సమాయత్తం కావాలని సూచించారు. అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ డిచ్‌పల్లి నుంచి వీసీలో పాల్గొన్నారు.

ఆగమవుతున్న లక్ష్మి ఆయకట్టు

- ఎస్సారెస్పీ నుంచి విడుదల కాని నీరు
- కాలువ కింద ఇప్పటికీ పూర్తికాని నాట్లు..
- వేసిన నాట్లు ఎండిపోయే పరిస్థితి
- ప్రాజెక్టులో ప్రస్తుతం 40.5 టీఎంసీల నీటి నిల్వ
- ఆయకట్టుకు 2 టీఎంసీలే అవసరం..



నల్లూర్ శివారులో కాలువలో అడ్డుగా బండరాళ్లు

బాల్కొండ: సాగునీటి కోసం ఎస్సారెస్పీ ప్రధాన కాలువల్లో ఒకటైన లక్ష్మి కాలువ ఆయకట్టు రైతులు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. పంటల సాగుతోపాటు చెరువులు నింపేందుకు 2 టీఎంసీల నీరు అవసరం ఉంటుందని, ప్రాజెక్టులో అవసరానికి అనుగుణంగా నీరున్నా లక్ష్మి కాలువకు విడుదల చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏడాది ఆగస్టు మొదటి వారంలో నీటివిడుదల ప్రారంభమయ్యేదని, ప్రాజెక్టు నిర్మాణం కోసం త్యాగం చేసిన తమ పరిస్థితి ఈ ఏడాది అగమ్యగోచరంగా మారిందని అంటున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి లక్ష్మి కాలువ ద్వారా 150 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేయాలని పాలకులు అధికారులపై ఒత్తిడి తెస్తుండగా, ఆయకట్టు రైతులు సైతం ఇదే డిమాండ్ చేస్తున్నారు. మెండోరా, ముప్కాల్, బాల్కొండ, వేల్పూర్, మోర్తాడ్, కమ్మర్‌పల్లి మండలాల పరిధిలో కాలువ కింద 50 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఇప్పటికే 70 నుంచి 80 శాతం నాట్లు పూర్తికాగా, వర్షాభావ పరిస్థితుల కారణంగా మరో 20 శాతం భూముల్లో నాట్లు ఇప్పటికీ పూర్తికాలేదు. అయితే నాట్లు పూర్తయిన భూములకు నీరందకపోవడంతో అక్కడక్కడ పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. ఇటు వర్షాలు కురవక, అటు ఎస్సారెస్పీ నుంచి లక్ష్మి కాలువ ద్వారా నీరందక రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

కొత్త లొల్లి..

పరిస్థితుల నేపథ్యంలో లక్ష్మి కాలువకు ప్రస్తుతం అనధికారికంగా కొంత నీరు విడుదలవుతోంది. అయితే ఇది ఎక్కడా రికార్డులో నమోదు కావడం లేదు. అనధికారికంగా విడుదలవుతున్న నీరు చాలామట్టుకు ఆవిరవుతోంది. డీ3 వరకు అరకొరగా నీరందుతుండగా, డీ4 ఆయకట్టు రైతులకు అసలే లేదు. ముప్కాల్ మండలం నల్లూర్ వాసులు ప్రాజెక్టు నిర్మాణం కోసం తమ గ్రామాన్నే కోల్పోయామని గ్రామ శివారులోని కాలువలో అడ్డుకట్ట వేసి నీటిని చెరువులోకి మళ్లించుకుంటున్నారు. దీంతో కొత్త లొల్లి షురూ అయ్యిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. లక్ష్మి కాలువ నిర్వహణ మైనర్ ఇరిగేషన్ (బాల్కొండ శాఖ) పర్యవేక్షిస్తుంది. నీరు మాత్రం ప్రాజెక్ట్ అధికారుల కంట్రోల్‌లో ఉంటుంది. పాలకులు స్పందించి నీటిని విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని, లేకుంటే జల వివాదాలు తలెత్తుతాయని రైతులు అంటున్నారు.

లక్ష్మి కాలువ	
ఆయకట్టు	50వేల ఎకరాలు
పొడవు	3.5 కిలోమీటర్లు
ఉపకాలువలు	04
చెరువులు	65
లిఫ్ట్‌లు	వేంపల్లి, నవాబు, చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి

అవసరం మేరకు నీరున్నా..

లక్ష్మి ఆయకట్టు పరిధిలోని 50వేల ఎకరాల్లో పంటలు గట్టెక్కడంతోపాటు చెరువులను నింపేందుకు 2 టీఎంసీల నీరు సరిపోతుందని ప్రాజెక్టు అధికారుల రికార్డులు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 40.5 టీఎంసీల నీరు నిల్వ ఉంది. లక్ష్మి కాలువ ద్వారా నీటి విడుదల చేపడితే పెద్దగా ప్రాజెక్ట్‌లో నీరు అందకుండా పోయే ప్రమాదమేమీ ఉండదు. కాకతీయ కాలువ ద్వారా నిరంతరం 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారని, అటువంటప్పుడు లక్ష్మికాలువ ద్వారా నీటిని విడుదల చేస్తే తప్పేమిటని ఆయకట్టు రైతులు ప్రశ్నిస్తున్నారు.

వెంటనే నీటిని విడుదల చేయాలి



లక్ష్మికాలువ ద్వారా వెంటనే నీటిని విడుదల చేయాలి. కాలువలో ఇప్పుడు వదులుతున్న నీరు చివరాయకట్టు వరకు రావడం లేదు. దీంతో వరి నాట్లు వేయలేక పోతున్నాం. కొన్ని నీళ్ల ఎందుకు ఇస్తున్నారు. కాలువలోనే ఇంకి పోతున్నాయి. పంటలను కాపాడేందుకు నీళ్ల వదలాలి.

– ఆకుల రాజన్న, ఆయకట్టు రైతు

మహిళాపాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

నిజామాబాద్‌అర్బన్ : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్‌లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. మిగిలిన సీట్ల భర్తీ కోసం పాలిసెట్ లో ఉత్తీర్ణులైన, పాలిసెట్ రాయని వారు ఈనెల 7లోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మిగతా వివరాలకు 8328374160 నంబరు ను సంప్రదించాలన్నారు.

మంజూరైంది.. ఇక ముందుకు

- గ్రామీణ విద్యార్థులకు అందుబాటులోకి సాంకేతిక విద్య
- తెయూలో ఇంజినీరింగ్ కళాశాల మంజూరుతో నెరవేరిన ఆకాంక్ష
- నాలుగు కోర్సులు.. 264 సీట్లు
- మూడో విడత కౌన్సెలింగ్‌లో సీట్ల భర్తీ
- కంప్యూటర్ సైన్స్‌లో ఆధునిక కోర్సులు

తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ వర్సిటీలో రాష్ట్ర ప్రభుత్వం ఇంజినీరింగ్ కళాశాల మంజూరు చేయడంతో ఉమ్మడి జిల్లా వాసుల దశాబ్దాల కల నెరవేరింది. యూనివర్సిటీ ఏర్పడిన కొత్తలో మొదటి వీసీగా పని చేసిన ప్రొఫెసర్ కాశీరాం వర్సిటీలో సాంప్రదాయ కోర్సులతోపాటు సాంకేతిక కోర్సులు ఉంటే బాగుంటుందని భావించారు. అప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేయగా, సుమారు 18 ఏళ్ల తర్వాత కల నెరవేరింది. ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన గ్రామీణ పేద విద్యార్థులకు సాంకేతిక విద్య అందుబాటులోకి వస్తోంది. కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ సైన్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) నాలుగు కోర్సులను ప్రభుత్వం మంజూరు చేసింది. కోర్సుకు 60 సీట్లతోపాటు ఈడబ్ల్యుఎస్ కోటా కింద 6 చొప్పున మొత్తం 264 సీట్లు అందుబాటులో ఉన్నాయి. మూడో విడత ఈఏపీసెట్ కౌన్సెలింగ్ ద్వారా సీట్లను భర్తీ చేయనున్నారు.

సవాళ్లు ముందున్నాయి..


ఇంజినీరింగ్ విద్యలో క్వాలిటీ ప్రమాణాలు చాలా వరకు తగ్గిపోయాయని పలు రిపోర్టులు, రీసెర్చ్‌లు చెబుతున్నాయి. ఉపాధి పొందేందుకు అవసరమైన టెక్నికల్ నైపుణ్యాలు విద్యార్థుల్లో కొరవడ్డాయని తెయూ ఇంజినీరింగ్ కళాశాల కూడా అదే దారిలో ప్రయాణిస్తే ఇంజినీరింగ్ కాలేజీ ఏర్పాటు ఆవశ్యకత మరుగున పడిపోతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. యూనివర్సిటీ అధికారులు ఇంజినీరింగ్ సిలబస్, బోధనా పద్ధతులు, పారిశ్రామిక రంగానికి అవసరమైన సాంకేతిక నైపుణ్యాలు అందించడం, ఉద్యోగాల కల్పనపై జాగ్రత్తలు వహించాలని విద్యా వేత్తలు సూచిస్తున్నారు.

వెబ్ ఆప్షన్స్

విద్యార్థులు ఈనెల 5, 6, 7 తేదీల్లో రిజిస్ట్రేషన్ చేసుకుని వెబ్ ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి. ఈఏపీసెట్ వెబ్‌సైట్‌లో 162 క్రమసంఖ్యలో ఉన్న తెలంగాణ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలకు 'టీయూసీఈ' కోడ్ కేటాయించారు. ఇంజినీరింగ్ కళాశాలలో చేరిన వారు ప్రభుత్వం నిర్ణయించిన రూ.50వేలు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అర్హులైన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తిస్తుంది. 10వేల లోపు ర్యాంకు సాధించిన వారు ఫీజు చెల్లించనక్కర్లేదు. 10వేలకు పైగా ర్యాంకు వచ్చిన విద్యార్థులకు రూ.35 వేల ఫీజు రీయింబర్స్‌మెంట్‌పోను కేవలం రూ.15 వేలు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

నిరంతర పర్యవేక్షణ అవసరం

ప్రస్తుతం ప్రవేశ పెట్టి న నాలుగు కోర్సులు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న ఆధునిక కోర్సులని చెప్పొచ్చు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకని వారికి సరైన బోధన అందించేందుకు క్వాలిఫైడ్ అండ్ ఎక్స్‌పీరియన్స్ ఫ్యాకల్టీని ఎంపిక చేయాలి. తగినంత కంప్యూటర్ ల్యాబ్స్ సౌకర్యం కల్పించాలి. విద్యార్థులకు రెగ్యులర్ సిలబస్ తో పాటు వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాలపై పూర్తి పట్టు ఉండేటట్లు సిలబస్ డిజైన్ చేయాల్సి ఉంటుంది. అలాగే ప్రసిద్ధి చెందిన కంపెనీలతో వర్సిటీ ఒప్పందం చేసుకుని విద్యార్థులకు ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్, ఉద్యోగాల కల్పన సౌకర్యం కల్పించేందుకు కృషి చేయాల్సి ఉంటుంది. ఈ విషయమై వర్సిటీ ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షించాల్సి ఉంటుంది.



తెయూలో ఇంజినీరింగ్ కళాశాల ప్రారంభించనున్న భవనం

అనుభవజ్ఞులైన ప్రొఫెసర్లు..



ప్రస్తుతం తెయూ కంప్యూటర్ సైన్స్ విభాగంలో అనుభవం కలిగిన అధ్యాపకులు ఉన్నారు. ఐదుగురు రెగ్యులర్ అధ్యాపకుల్లో ఒకరు సీనియర్ ప్రొఫెసర్, ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లు, ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉండగా, మరో ఇద్దరు కాంట్రాక్ట్ అధ్యాపకులు ఉన్నారు. అలాగే కంప్యూటర్ ల్యాబ్‌లు ఉన్నాయి. – ఎం.యాదగిరి, రిజిస్ట్రార్, తెయూ

డిమాండ్ ఉన్న కోర్సులు..



ప్రస్తుతం మంజూరైన నాలుగు కంప్యూటర్ కోర్సులు ప్రస్తుతం మార్కెట్‌లో బాగా డిమాండ్ ఉన్నవి. విద్యార్థులు ఈఏపీసెట్ మూడో విడత కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలు పొందే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. వచ్చే విద్యా సంవత్సరం ఈసీఈ, ఈఈఈ, ఈఐఈ కోర్సులను ప్రవేశపెట్టేందుకు కృషి చేస్తాం. – సీహెచ్ ఆరతి, ప్రిన్సిపాల్

క్లుప్తంగా

ఐటీఐలో స్పాట్ అడ్మిషన్లు

నిజామాబాద్అర్బన్: ఐటీఐలో ఈనెల 6 నుంచి 28 వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ యాదగిరి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఉన్న ఐదు ప్రభుత్వ ఐటీఐలతోపాటు మూడు ప్రైవేటు ఐటీఐలలో వివిధ కోర్సులలో అభ్యర్థులు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఆసక్తిగల వారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బోధన్ పట్టణంలో..

బోధన్: పట్టణ శివారులోని ఆచన్‌పల్లి ప్రాంతంలో ఉన్న ఐటీఐ, ఏటీసీ(అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్)లో రాష్ట్ర ఉపాధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో వివిధ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు చేపట్టినట్లు ఏటీసీ ప్రిన్సిపల్ శాంతారాం ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులై కనీసం 14 ఏళ్ల వయస్సు నిండిన విద్యార్థులు ప్రవేశానికి అర్హులని అన్నారు. వాక్–ఇన్ ద్వార ప్రవేశం పొందాలంటే ఆన్‌లైన్‌లో దరఖాస్తు తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు. మొదటి, రెండో దశల్లో దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని, నేరుగా ఈ వాక్ ఇన్ ద్వారా సీటు పొందేందుకు అర్హులేనన్నారు. కొత్తగా దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ప్రతి రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఐటీఐ, ఏటీసీ నందు నేరుగా హాజరై సీటు పొందవచ్చని వివరించారు. కోర్సుల్లో ఖాళీ సీట్ల వివరాలు ప్రతి రోజు ఉదయం వెబ్ సైట్‌లో అప్‌డేట్ అవుతాయని తెలిపారు. ఒకసారి ట్రేడ్ కోర్సుల్లో ప్రవేశం పొందిన తర్వాత మార్పు చేసే అవకాశం ఉండదన్నారు. సీట్ల కెటాయింపు కామన్ మెరిట్, దరఖాస్తు సమయం ఆధారంగా ఉంటుందని తెలిపారు. నిరుద్యోగ యువత, విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ కోరారు.

బషీరాబాద్ ఐటీఐలో..

కమ్మర్‌పల్లి: మండలంలోని బషీరాబాద్ ఐటీఐ కళాశాలలో బుధవారం నుంచి స్పాట్ అడ్మిషన్లు చేపడుతున్నట్లు ప్రిన్సిపాల్ కోటిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, మెకానిక్ డీజిల్, వెల్డర్, కోప, డ్రెస్ మేకింగ్‌తో పాటు అధునాతన కోర్సులైన మ్యానుఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్, డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్, అర్టిసన్ యుసింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్, అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మిషెనింగ్ టెక్నీషియన్, వంటి పలు కోర్సుల్లో రెండో విడత అడ్మిషన్లు చేపడుతున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో సంప్రదించాలని సూచించారు. పూర్తి వివరాలకు 81067 94500, 85004 66380 నంబర్లను సంప్రదించాలన్నారు.

శిబు సోరెన్‌కు నివాళులు

- బీఆర్ఎస్ తరపున జార్ఖండ్ వెళ్లిన ప్రశాంత్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: జార్ఖండ్ పితామహుడైన శిబు సోరెన్ కన్నుమూయడంతో మంగళవారం ఆయనకు బీఆర్ఎస్ పార్టీ తరపున మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి నివాళులు అర్పించారు. కేసీఆర్ ఆదేశాల మేరకు జార్ఖండ్‌లోని శిబు సోరెన్ సొంత గ్రామమైన రామ్‌గఢ్ జిల్లాలోని నేమ్రా గ్రామానికి ఎమ్మెల్యే, కోవా లక్ష్మీతో కలిసి వెళ్లి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. శిబు సోరెన్ కుమారుడు, ముఖ్యమంత్రి హేమంత్ సొరెన్‌ను కలిసి సానుభూతి తెలిపారు. కేసీఆర్ పంపిన సంతాప సందేశాన్ని తెలియజేశారు. తెలంగాణ సాధన ఉద్యమంలో శిబు సోరెన్ అందించిన సంఘీభావాన్ని గుర్తుచేసుకున్నారు.

సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు

- యాంత్రీకరణ పథకాన్ని మళ్లీ ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వం
- జిల్లాకు 6,742 యూనిట్లు, రూ.5.20 కోట్ల నిధులు కేటాయింపు
- రైతులు దరఖాస్తులు చేసుకోవాలని కోరిన వ్యవసాయ శాఖ



డొంకేశ్వర్(ఆర్మూర్): సాగులో రైతులకు వెన్నుదన్నుగా ఉండేందుకు వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ ప్రారంభించింది. ఎస్సీ, ఎస్టీ, మహిళా రైతులకు 50 శాతం, మిగతా రైతులకు 40 శాతం సబ్సిడీపై యంత్రాలు అందజేయాలని నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా వ్యవసాయ కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాకు 6,742 యూనిట్లు మంజూరు కాగా మొత్తం పదకొండు రకాల పరికరాలకు ఈ పథకం వర్తించనుంది. ఇందుకుగాను రూ.5.20కోట్లు కేటాయించగా మొదటి విడతగా రూ.1.67కోట్లు జిల్లాకు వచ్చాయి. అయితే ట్రాక్టర్లు, డ్రోన్లకు అవకాశం కల్పించకపోవడం రైతులను కొంత నిరాశపరిచింది. వ్యవసాయ పరికరాల కోసం రైతులు స్థానిక ఏఈవోలను లేదా మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో సంప్రదించాలని డీఏవో గోవింద్ తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి రైతు పట్టాదార్ పుస్తకం, ఆధార్ కార్డు అందజేయాలని సూచించారు. అలాగే భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించి దానికి సంబంధించిన పత్రాన్ని దగ్గర ఉంచుకోవాలని పేర్కొన్నారు.

కమిటీల ద్వారా లబ్ధిదారుల ఎంపిక

వ్యవసాయ పరికరాల కోసం వచ్చిన దరఖాస్తుల్లో లబ్ధిదారుల ఎంపిక అధికారులతో కూడిన కమిటీలు ఫైనల్ చేయనున్నాయి. రూ.లక్ష లోపు పరికరాలకు మండల స్థాయి కమిటీ ఎంపిక చేస్తుంది. ఇందులో మండల వ్యవసాయాధికారి, తహసీల్దార్, ఎంపీడీవో ఉంటారు. అలాగే రూ.లక్షకు పైబడిన యంత్రాలుంటే జిల్లా స్థాయి కమిటీ లబ్ధిదారులను ఎంపిక చేస్తుంది. జిల్లా కమిటీలో కలెక్టర్ చైర్మన్‌గా, జిల్లా వ్యవసాయాధికారి, ఆగ్రోస్ ఆర్ఎం, వ్యవసాయ శాస్త్రవేత్త, ఎల్‌డీఎం సభ్యులుగా ఉంటారు.

నియోజకవర్గాల వారీగా మంజూరైన యూనిట్లు, నిధులు

నియోజకవర్గం	యూనిట్లు	నిధులు(లక్షల్లో)
నిజామాబాద్‌రూరల్	1,461	103.28
ఆర్మూర్	1,077	92.05
భీమ్‌గల్	1,684	122.35
బోధన్	1,149	91.25
బాన్సువాడ	1,242	89.60
నిజామాబాద్‌అర్బన్	98	14.50

పరికరాలు	యూనిట్లు
పవర్ స్ప్రేయర్లు	715
పిచికారీ యంత్రాలు	5,098
రోటవేటర్లు	274
సీడ్ కమ్ ఫెర్టిలైజర్ డ్రిల్లర్స్	64
డిస్క్‌హారో రోటవేటర్స్	347
బండ్ ఫార్మర్	15
పవర్ వీడర్స్	33
బ్రష్ కట్టర్స్	58
పవర్ టిల్లర్స్	41
మేజ్ షెల్లర్స్	20
స్ట్రా బాలర్స్	77



పరుచుకున్న పచ్చదనం

నిజామాబాద్ నుంచి గాంధారికి వెళ్లే మార్గంలో పచ్చని పంటపొలాల మధ్య తండాలు

వర్షాకాలంలో ఎక్కడ చూసినా పచ్చదనం నిండుగా పరుచుకుంటుంది. పల్లెలు పచ్చని కోకను చుట్టుకున్నట్లు ప్రకృతి కాంతతో మమేకమై కనిపిస్తుంటాయి. నిజామాబాద్ నుంచి కామారెడ్డి జిల్లా గాంధారి మండలంకు వెళ్లే దారిలో బీర్మల్‌తండా, గుర్జాల్ తండా , చిన్న గుర్జల్ తండా, యాచారం తండాల చుట్టూ పచ్చదనం పరుచుకుంది. ఈ తండాల్లో వర్షాకాలం వచ్చిందంటే మక్క, పత్తి, సోయా పంటలను గిరిజనులు సాగుచేస్తారు. ఈక్రమంలో పచ్చని పంటపొలాల మధ్య తండాలు పచ్చదనంతో ఆహ్లాదంగా మారాయి. ఈ సుందర దృశ్యాన్ని సాక్షి మంగళవారం క్లిక్‌మనిపించింది. –సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

ముగిసిన విద్యుత్ ఉద్యోగుల రాష్ట్రస్థాయి హాకీ టోర్నీ





వరంగల్ జట్టుకు విజేత ట్రోఫీని అందజేస్తున్న అధికారులు.. రన్నర్ ట్రోఫీతో నిజామాబాద్ జట్టు

- విజేతగా నిలిచిన వరంగల్ జట్టు
- రన్నర్‌గా నిజామాబాద్

నిజామాబాద్‌నాగారం: నగరంలోని పోలీస్ పరేడ్ మైదానంలో రెండు రోజులపాటు నిర్వహించిన విద్యుత్ ఉద్యోగుల రాష్ట్రస్థాయి హాకీ టోర్నమెంట్ మంగళవారం ముగిసింది. విద్యుత్ స్పోర్ట్స్ కౌన్సిల్ చైర్మన్, విద్యుత్‌శాఖ ఎస్ఈ రవీందర్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. వివిధ జిల్లాలకు చెందిన జట్లు పోటీ పడగా, విజేతగా వరంగల్ జట్టు నిలిచింది. రన్నర్‌గా నిజామాబాద్, మూడో స్థానంలో కరీంనగర్ జట్లు నిలిచాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విద్యుత్‌శాఖ ఓఎంసీ పీవీ రావు హాజరై విజేతలకు ట్రోఫీలు, మెడల్స్, జ్ఞాపికలు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలన్నారు. అనంతరం సామాజిక కార్యక్రమాలు చేసిన, జాతీయస్థాయి అవార్డు గ్రహీత తోట రాజశేఖర్‌ను సత్కరించారు. డీఈలు రమేష్, విక్రమ్, టోర్నమెంట్ ఆర్గనైజర్స్ తోట రాజశేఖర్, ఏవో గంగారాం, సురేష్ కుమార్, శంకర్ నాయక్, గోపి, ఉత్తమ్, దినేష్, మూర్తి, సీనయ్య, సతీష్, సుభాన్, పఠాన్, సత్యనారాయణ, స్వామి ,శ్రీకాంత్, హరీష్, గంగాధర్ తదితరులు ఉన్నారు.

స్టాక్ ఉండగానే ఎరువులు తెప్పిస్తున్నాం

- ఎక్కడా కొరత లేదు
- ఇందిరమ్మ ఇళ్లకు ఎస్‌హెచ్‌జీ ద్వారా రుణం
- నిర్మాణం పూర్తయిన 'డబుల్' ఇళ్లను అర్హులకు కేటాయించాలి
- అధికారులకు కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశాలు

బోధన్: జిల్లాలో 11వేల మెట్రిక్ టన్నుల ఎరువుల స్టాక్ ఉండగానే మళ్లీ స్టాక్ తెప్పిస్తున్నామని, ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటుండడంతో ఎక్కడా కొరత ఏర్పడలేదని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి అన్నారు. ఎడపల్లి మండలం కుర్నాపల్లిలో కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా పర్యటించారు. గ్రామంలోని పల్లె దవాఖాన, సొసైటీ ఎరువుల గోదామును తనిఖీ చేశారు. పల్లె దవాఖానలో సిబ్బంది హాజరు, అవుట్ పేషంట్‌ల రిజిస్టర్లను తనిఖీ చేశారు. దోమల నియంత్రణకు ఫాగింగ్ చేయడం లేదని తెలిసి గ్రామ పంచాయతీ కార్యదర్శి సురేశ్‌పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడి నుంచి డీపీవోకు ఫోన్ చేసి ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ఫాగింగ్ చేపట్టేలా చూడాలని ఆదేశించారు. సహకార సొసైటీ గోదాములో స్టాక్‌ను తనిఖీ చేసిన కలెక్టర్.. సరిపడా ఎరువులు అందుతున్నాయా? అని అక్కడికి వచ్చిన రైతులను ప్రశ్నించారు. ఒకే సారి కాకుండా అవసరానికి అనుగుణంగా ఎరువులు తీసుకెళ్లాలని రైతులకు సూచించారు.

ఇందిరమ్మ లబ్ధిదారులకు రూ.30కోట్ల రుణాలు

ఇందిరమ్మ ఇల్లు మంజూరైనా నిర్మాణానికి ఆర్థికస్థోమత లేని లబ్ధిదారులకు స్వయం సహాయక మహిళా పొదుపు సంఘాల ద్వారా రూ.లక్ష చొప్పున రుణ సదుపాయం కల్పిస్తున్నామని, రాష్ట్రంలోనే అత్యధికంగా జిల్లాలో లబ్ధిదారులకు రూ.30కోట్లకు పైగా రుణాలు అందించామని కలెక్టర్ వెల్లడించారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తుండగా, ఉచితంగా ఇసుకను సమకూరుస్తున్నామన్నారు. అయినప్పటికీ లబ్ధిదారులు ఎవరైనా ఇంటి నిర్మాణానికి ముందుకు రాకపోతే వారి నుంచి రాతపూర్వకంగా లేఖలు తీసుకుని జాబితాలో నుంచి వారి పేర్లను తొలగించి వారి స్థానంలో అర్హులకు ఇల్లు కేటాయించాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్ రూం ఇళ్లను అర్హులకు కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో ఆఫీస్‌ల్లో ప్రజా పాలన సేవా కేంద్రాలు కొనసాగుతున్న విషయం ప్రజలందరికీ తెలిసేలా ఆఫీస్‌ల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు.



కుర్నాపల్లిలో రైతులు, గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

చేయూత పెన్షన్ పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ

పెర్కిట్(ఆర్మూర్): కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వెంటనే చేయూత పెన్షన్‌ను పెంచి, అర్హులకు అందించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో మంగళవారం మహాగర్జన సన్నాహక సభ నిర్వహించారు. ఈసందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు చేయూత పింఛన్లను రూ.2 వేల నుంచి రూ.4 వేలు, వికలాంగుల పింఛన్లను రూ.4 వేల నుంచి రూ.6 వేలు పెంచుతామని హామీలిచ్చారు. కానీ అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా సీఎం రేవంత్ రెడ్డి పింఛన్ పెంపు విషయంలో ముఖం చాటేస్తున్నారన్నారు. ఈ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి దేశంలోనే నెంబరు వన్ మోసగాడని, అలాగే ప్రభుత్వాన్ని ప్రశ్నించని ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ నంబరు వన్ అసమర్థ నాయకుడని అన్నారు. పింఛను పెంచే విషయంలో ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకోవడానికే హైదరాబాద్‌లో ఈ నెల 13న చేయూత, వికలాంగుల పింఛన్‌దారులతో మహాగర్జన సభ చేపడుతున్నట్లు వెల్లడించారు. సభను ప్రజలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు సుజాత సూర్యవంశీ, బీరప్ప, సలీం, ఖలీం, స్వామి, పోశెట్టి, బాలు, కనక ప్రమోద్, రాజేశ్, స్వామి దాస్, శ్యామ్, కృష్ణవేణి, సరిత, గంగాధర్ పాల్గొన్నారు.

సీఎంసీ మెడికల్ కాలేజ్ పేరిట మోసం!

- పలువురి వద్ద రూ.కోట్లు వసూలు చేసిన నిందితుడు!
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన



సీఎంసీ మెడికల్ కాలేజ్

నిజామాబాద్‌నాగారం/డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండలం సుద్దపల్లి శివారులో గల సీఎంసీ (క్రిస్టియన్ మెడికల్ కాలేజ్) పేరిట ఓ వ్యక్తి నగరంలోని పలువురి వద్ద రూ.కోట్లలో డబ్బులను వసూలు చేశాడు. కానీ వైద్యశాలకు అనుమతి రాకపోవడం, సిబ్బందికి జీతాలు ఇవ్వకపోవడంతో నిందితుడిని నిలదీసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా.. కర్ణాటకకు చెందిన షణ్ముఖ మహాలింగం అనే వ్యక్తి సీఎంసీని ఇటీవలే పునఃప్రారంభించారు. ఈక్రమంలో అతడు ఓ ఐఎంఏ నేతకు డైరెక్టర్ పదవి ఇస్తానని చెప్పి రూ. 3కోట్ల వరకు నొక్కేసినట్లు సమాచారం. దీంతోపాటు వైద్యులను ఫ్యాకల్టీగా పెట్టుకుంటానని చెప్పడంతో జిల్లాలో ఉన్న పలువురు వైద్యుల వద్ద షణ్ముక లింగం చెప్పినట్లు అతడు డబ్బులు వసూలు చేసి ఇచ్చినట్లు సమాచారం. అలాగే కాంట్రాక్టర్ ద్వారా పనులు చేయించడంతో పాటు మూడు నెలలుగా కొంతమంది డాక్టర్లు, స్టాప్ నర్సులు, ఇతర ఉద్యోగులను,శానిటేషన్, సెక్యూర్టీగార్డ్స్ తదితర సిబ్బందిని నియమించుకున్నారు. నియామకాల్లో కూడా ఒక్కోక్కరి వద్ద రూ. 50వేల నుంచి రూ. 1లక్ష వరకు వసూలు చేసిన్నట్లు సమాచారం. కానీ జీతాలు ఇవ్వకపోవండతో సీఎంసీ చైర్మన్ అని చెప్పుకునే షణ్ముకమహాలింగంను కొన్ని రోజుల క్రితం సిబ్బంది నిలదీయడంతో వెలుగులోకి వచ్చింది. పోలీసులు వచ్చి షణ్ముకను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. బాధితుల ఫిర్యాదుతో డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది.

అనుమతి ఇవ్వని ఎన్ఎంసీ..

సీఎంసీని పునఃప్రారంభించడంతో నెల కిందటే ఎన్ఎంసీ బృందం ఢిల్లీ నుంచి వచ్చి పరిశీలించింది. నిబంధనలు పాటించలేదని అనుమతి ఇవ్వలేమని తేల్చిచెప్పేశారు. సీఎంసీ కాలేజ్‌లో ఆస్పత్రి ఏర్పాటు చేయాలంటే ఖచ్చితంగా వైద్యారోగ్యశాఖ నుంచి అనుమతి తీసుకోవాలి. దీంతో నిర్వాహకులు అధికారులపై ఒత్తిడి తీసుకురావడంతో మూడు నెలల ప్రాథమిక అనుమతి ఇచ్చారు. ఇందుకోసం అధికారులు పెద్ద ఎత్తున ముడుపులు అందుకున్నారని శాఖలో ఉద్యోగులు బహిరంగంగా చర్చించుకుంటున్నారు.

చీటింగ్ కేసు నమోదు చేశాం..

సీఎంసీ కాలేజీకి సంబంధించి డాక్టర్ అజ్జ శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు షణ్ముఖ మహాలింగంపై చీటింగ్ కేసు నమోదు చేశాం. విచారణ చేస్తున్నాం. త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తాం.

–మహమ్మద్ షరీఫ్, డిచ్‌పల్లి ఎస్సై

మోతీరాంనాయక్ తండాలో ఉద్రిక్తత

- అటవీ భూమిలో వేసిన మొక్కజొన్న పంటకు గడ్డిమందు స్ప్రేకు ఫారెస్టు అధికారుల యత్నం
- అడ్డుకున్న గిరిజనులు
- మనస్తాపంతో గడ్డి మందు తాగిన రైతు!



ఫారెస్ట్ అధికారులను అడ్డుకుంటున్న గిరిజనులు, మహిళలు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని బైరాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని మోతీరాం నాయక్ తండాలో మంగళవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. అటవీభూమిలో పంట సాగుచేయడంతో ఫారెస్టు అధికారులు పంటకు గడ్డి మందు పిచికారి చేయడంతో అధికారులకు, గిరిజనులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈక్రమంలో ఓ రైతు ఆత్మహత్యకు యత్నించాడు. వివరాలు ఇలా.. తండాకు చెందిన ప్రకాశ్ అనే గిరిజన రైతు అటవీ భూమిలోని 3ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేస్తున్నాడు. ఏప్రిల్ 29న రైతు ఆ భూమి చదును చేయగా, ఫారెస్ట్ అధికారులకు ఫిర్యాదు రావడంతో చదును చేయవద్దన్నారు. అవేమీ పట్టించుకోకుండా సదరు రైతు పంట సాగుచేయడంతో మేలో నోటీసులిచ్చారు. అయినా అతడు స్పందించకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎఫ్ఆర్‌వో రాధిక సమక్షంలో ఫారెస్ట్ అధికారులు గడ్డి మందు స్ప్రే చేశారు. వెంటనే అధికారులను ప్రకాష్ కుటుంబంతో పాటు గిరిజనులు అడ్డుకున్నారు. కొన్ని రోజుల్లో పంట చేతికొస్తుందని, ఆ తర్వాత పంట వేయబోమని నచ్చజేప్పే ప్రయత్నం చేశారు. కానీ అప్పటికే రెండెకరాల్లో మందును స్ప్రే చేసినట్లు గిరిజనులు ఆరోపిస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువురిని సముదాయించారు. చేతికొచ్చిన పంటను అధికారులు నాశనం చేయడంతో మనస్తాపానికి గురైన రైతు ప్రకాష్ గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఆయనను వెంటనే నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కాగా ప్రకాశ్ గడ్డి మందు తాగలేదని, తమను బెదిరించేందుకు అలా చేశారని ఫారెస్ట్ అధికారులు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా అటవీభూమిని సాగుచేయడమే కాకుండా ఫారెస్టు అధికారుల విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుస్మిత తెలిపారు. అటవీ అధికారుల ఫిర్యాదు మేరకు రైతు ప్రకాష్, అతడి భార్య కవిత, బంధువైన జలెందర్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

సైబర్‌క్రైమ్ డబ్బులు రికవరీ

రుద్రూర్: కోటగిరిలో సైబర్ మోసానికి గురైన వ్యక్తికి మంగళవారం డబ్బులను రికవరీ చేసినట్లు ఎస్సై సునీల్ తెలిపారు. వివరాలు ఇలా.. కోటగిరి మండల కేంద్రానికి చెందిన పాకల నద్పి సాయిలుకు ఏప్రిల్ 3న అనుమానాస్పద లింక్ మెసేజ్ రాగా ఓపెన్ చేశాడు. దీంతో సైబర్ నేరగాళ్లు సాయిలు సిమ్‌ను స్వాప్ చేసి అతనికి వచ్చే మెసేజ్‌లను వేరే నెంబర్‌కు వెళ్లేలా చేశారు. అనంతరం సాయిలు బ్యాంక్ అకౌంట్ నుంచి డబ్బులను వాళ్ల ఖాతాకు మళ్లించుకున్నారు. బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు పోయినట్లు గుర్తించిన బాధితుడు కోటగిరి పోలీస్‌స్టేషన్‌లో వచ్చి తెలియజేశాడు. వారు స్పందించి సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయించగా నిందితుల ఖాతాను స్తంభింపచేశారు. అనంతరం రికవరీ చేసిన రూ. ఐదు వేలను కోర్టు ఆదేశాల మేరకు సోమవారం బాధితుడి ఖాతాలో జమ చేసినట్లు ఎస్సై వివరించారు.

క్రైం కార్నర్

చెరువులో పడి ఒకరి మృతి

సిరికొండ: మండలంలోని రావుట్ల గ్రామంలోని ఊర చెరువులో పడి ఒకరు మృతిచెందినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన జాగర్ల నరహరి(43) అనే వ్యక్తి ఈ నెల 3న స్నానం చేయడానికి ఊర చెరువులోకి వెళ్లాడు. కానీ ఈత రాకపోవడంతో అతడు నీట మునిగి, మృతిచెందాడు. మృతుడి భార్య లహరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు...

మాక్లూర్: ఇటీవల ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని ధర్మోరా గ్రామానికి చెందిన అరుణ్(28) కుటుంబ గొడవల కారణంగా ఈనెల 3న ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. మంగళవారం పరిస్థితి విషమించడంతో అతడు మృతిచెందాడు. ఈ ఘటనతో గ్రామంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ తలెత్తే అవకాశం ఉండటంతో అరుణ్ అంత్యక్రియలు పూర్తయ్యేవరకు పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

చోరీ కేసులో ఒకరికి ఏడాది జైలు శిక్ష

బాల్కొండ: మండల కేంద్రంలోని ఓ వైన్స్ దుకాణంలో చోరీకి పాల్పడిన వ్యక్తికి ఆర్మూర్ కోర్టు ఏడాది జైలు శిక్ష విధించినట్లు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణ తెలిపారు. వివరాలు ఇలా.. బాల్కొండలోని తుల్జా భవాని వైన్స్ షాపులో 2024 సెప్టెంబర్ 4న నిర్మల్ మండలం కొండపూర్ గ్రామానికి చెందిన నక్క పోశెట్టి చోరీకి పాల్పడ్డాడు. షట్టర్ తాళం పగలగొట్టి రూ. 14వేల నగదుతోపాటు కొన్ని మందు బాటిళ్లను ఎత్తుకెళ్లాడు. ఈఘటనపై అప్పటి ఎస్సై నరేష్ కేసు నమోదు చేసి, నిందితుడిని పట్టుకొని, ఆర్మూర్ కోర్టులో హాజరుపర్చారు. జడ్జి సరళరాణి సాక్ష్యాధారాలను పరిశీలించి, మంగళవారం అతడికి ఏడాది జైలుశిక్షతోపాటు రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఆయన తెలిపారు.

అట్రాసిటీ కేసులో ఒకరికి..

నిజామాబాద్ లీగల్: కులం పేరుతో దూషించి, దాడి చేసిన కేసులో ఒకరికి నిజామాబాద్ ఎస్సీ, ఎస్టీ కోర్టు ఏడాది జైలు శిక్ష విధించింది. వివరాలు ఇలా.. నగరంలోని మిర్చి కాంపౌండ్ చెందిన దుర్గయ్యను, తన కొడుకును క్రాంతి కుమార్ అనే వ్యక్తి 24 డిసెంబర్ 2020న కులం పేరుతో దూషించి దాడి చేశాడు. బాధితులు వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుని కోర్టులో హాజరుపర్చారు. విచారణ చేపట్టిన జడ్జి నిందితుడికి ఏడాది జైలు శిక్షతోపాటు రూ.2,400 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

బాధ్యతల స్వీకరణ



ఆర్మూర్: ఆర్మూర్ రెవెన్యూ డివిజన్ సబ్ కలెక్టర్‌గా అభిగ్యాన్ మాల్వియా ఐఏఎస్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. పట్టణంలోని రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆయన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, అధికారులు అభినందనలు తెలిపారు.

హైవేపై పల్టీలు కొట్టిన కారు



ఇందల్వాయి: మండలంలోని గన్నారం గ్రామ శివారులోగల జాతీయ రహదారిపై ఓ కారు అదుపుతప్పి పల్టీలు కొట్టి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. టోల్‌ప్లాజా సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా.. నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన షేక్ హమీద్, షేక్ నదీప్, షేక్ అలీ ముగ్గురు కలిసి మంగళవారం ఉదయం శంషాబాద్ ఏయిర్‌పోర్టు నుంచి నిజామాబాద్‌కు బయలుదేరారు. గన్నారం గ్రామ శివారులోగల జాతీయ రహదారిపై వారి కారు ప్రమాదవశాత్తు అదుపుతప్పి పల్టీలు కొట్టి రోడ్డు కిందకు దూసుకెళ్లింది. వెంటనే స్థానికులు గమనించి కారులో ప్రయాణిస్తున్న ముగ్గురిని సురక్షితంగా బయటకు తీశారు.

జంబిహనుమాన్ ఆలయ అధికారులపై విచారణ



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జంబిహనుమాన్ ఆలయంలో గతేడాది జరిగిన చోరీపై మంగళవారం ఆలయ అధికారులను ఎండోమెంట్ అధికారులు విచారించారు. ఆలయంలో గత సంవత్సరం అక్టోబర్‌లో జరిగిన చోరీపై గతంలో శివసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీహరి ఎండోమెంట్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అందులో భాగంగా దేవాదాయ శాఖ విచారణ అధికారి అంజలిదేవి, ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ విజయ్‌రామరావు ఆలయంలో ఈవో రవీంధర్, జూనియర్ అసిస్టెంట్ హరితరాణి, అటెండర్ గోపిపై విచారణ చేపట్టారు. శివసేన పార్టీ నాయకుల, అధికారుల పరస్పర ఆరోపణలను విచారణ అధికారులు నమోదు చేసుకున్నారు. ఈ నివేదికను ఎండోమెంట్ కమిషనర్‌కు ఇవ్వనున్నట్లు అంజలిదేవి తెలిపారు. అలాగే ఈవో రవీంధర్‌ను, జూనియర్ అసిస్టెంట్ హరితరాణిని, అటెండర్ గోపిలను సస్పెండ్ చేయాలని శివసేన పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ విచారణలో దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటీ చైర్మన్ సత్యనారయణ, అయ్యప్ప సేవాసమితి సభ్యులు, పంతులు నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

నేడు జాబితా విడుదల

నిజామాబాద్‌అర్బన్: సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో కేజీబీవీలలో అకౌంటెంట్ పోస్టులకు సంబంధించి జాబితాను బుధవారం విడుదల చేస్తామని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. కేజీబీవీలలో ఖాళీగా ఉన్న అకౌంటెంట్ పోస్టుల భర్తీకి ఇటీవల దరఖాస్తులు స్వీకరించారు. జాబితాను సిద్ధం చేసి అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆయన తెలిపారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 7లోపు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.